# మాదిగ అమ్మాయి

నా భార్యకి పెళ్ళయిన మెదిమిదేళ్ళలో, ఆరో గర్భం తెప్పించి, అత్తవారింటికి పంపి, ఆమె ఎట్లావుందో చూద్దామని డిశంబరు శలవలకి వాళ్ళ పల్లెటూరు నీతో నన్నా చెప్పకుండా వెళ్ళిపోయినాను. అట్లాంటి పల్లెటూరు చూస్తే, ఇంతవరకు మనం యీ లోకంలో ఎక్కడ వున్నాము, యేం చేస్తున్నాము, బతుకుతున్నామా, క్షేమంలో యీగల్లాగు కాయితాల కట్టలమధ్య పడి ఆఫీసులో మరణవేదన పడుతున్నామా?—అనే సందేహం కలుగుతుంది. నిర్మలమైన ఎండుగడ్డివాసనా, చేల పచ్చని రంగూ, పిట్టలస్వేచ్ఛగల అరుపులూ, పువ్వుల కొత్త రంగులూ, చెట్ల నవనవా, గడ్డి మెత్తదనం, అన్నీ పూర్వ జన్మంలో, విడిచిపెట్టి మరిచిపోయిన బంధువులవలె ఒక్క నిమిషంలో మనని చేరి అల్లుకుంటాయి. అన్నిటికన్నా, ఈ పల్లెటూరుకన్యల నేవళం ఉత్సాహం మెక్కువైన సంగతులు. అయ్యో! ఈ ముప్పైఐదేళ్ళూ ఆఫీసు కుర్చీలోనూ నవారు మంచంమీద, వ్యర్థంగా గడిపానే! ఇట్లాంటి ప్రపంచం చేతికందేదూరంలో వుండగా, అనుకుని ఒక రాత్రల్లా కంటిమీద రెప్పవెయ్యకుండా దుఃఖించాను. ఆ పిల్లలు!! నున్నటి చర్మంకింద బలిసిన కండల్ని మెక్కడంటే అక్కడకదల్చడానికిశక్తిగలవాళ్ళవలే కనబడతారు. గడ్డితో మెత్తనైన కాలిబాటని—వెనక మాటూరా?

బైస్కిలా? యేదివచ్చి మీదపడుతుందో అనే భయం లేకుండా నడుస్తోవుంటే, ఆఫీసు "రిమైన్‌డర్ల" సంగతి యోచిస్తున్నా, కళ్ళయెదట సిరస్తారుమొహం తాండవమాడుతున్నా—గున్నలవలె పెరిగి, స్వేచ్ఛగా ఆ బలాన్నంతా యేంచేసుకోవాలో తెలీక బాధపడుతున్నట్లు నడిచే కన్యల్ని చూసేటప్పటికి, అవ్యాజంగా అంతరాళంలోంచి చేతులు వాళ్ళమీద వెయ్యాలని కోర్కె గలుగుతుంది; నున్నని చలువరాతిమీద మెత్తని మొహమల్ పరిస్తే దాన్ని తాకాలనిపించేటట్లే; చక్కగా మాలిస్ చేసిన, మంచిజాతిగుర్రం మెడమీద కొట్టాలనిపించినట్లే; హంసవన్నె పావురాల వీపుమీద దువ్వాలనిపించినట్లే.... మొహాలు అందంగా వుండకపోవచ్చు, నగలేం లేకపోవచ్చు—సన్నని తెల్లని వుప్పాడచీరెలూ, పరజాలవంటి బనారసు చీరెలూ కట్టకపోవచ్చు; జుట్టు దువ్వకపోవచ్చు; కాని మెడదగ్గిర్నించి పాదంవరకు ఆ కనుచూపుని జార్చే ఆ వంపులేచాలు; నడిచేటప్పటికి ఆనడుముక్రింద మార్పులే చాలు; తెల్లగా లేకపోతేనేం! ఆ వొంటిమీద శుభమైన మెరుగేచాలు; పనిచేసి వొళ్ళు కొంచెం మోటైతేనేం? పాదాలు కాయలుకాసి పగిలివుంటేనేం? ఇంకోవిశేషం; మొగవాణ్ణి చూడగానే పరిగెత్తి దాక్కోరు, తలుపులోంచి తొంగిచూడరు, పలకరిస్తే సిగ్గుపడుతో వినబడి వినబడకుండా సణుక్కోరు, మాటాడిస్తే యేంతప్పో యెవరేమంటారోనని, మనమూ భయపడక్కర్లేదు. దానిమ్మపండు పగిలినట్లు గుండ్రని బుగ్గలు తెరిచి, తెల్లనిపళ్ళు కనపరుస్తో,

నిమిషానికి నిష్కారణంగా పదిసార్లు నవ్వుతారు. నిన్ను చూసే అనుకోవచ్చు: కాని అది వూరికే వారిలో ప్రవహిస్తున్న సృష్టి ఆనందమనుకుంటా. యీకాంతిలో, ఈ గాలిలో యింత ఆరోగ్యంగా బతికివున్నామనే వుత్సాహమనుకుంటా. అవుదూడ చూడు, మెల్లిగా నడుస్తో యిటు చూసి చంగున వుత్సాహంతో తోకెత్తి గంతేసి చిక్కకుండా యేడిపిస్తుంది. వాళ్ళ నవ్వుకీ, కళ్ళలోని వెలుగుకీ అదే కారణం. ఆ కళ్ళలోని విచిత్రమైన చంచలత్వం, సూర్యాస్తమయ తీక్ష్ణకాంతివల్లనో, విశాలవక్షపు సౌందర్యభారంవల్లనో నిర్ణయించుకోడం కష్టం. వంటవాసనల్లో, పిల్లల యేడుపుల్లో, నగలకోసం మర్యాదకోసం పడే తగాదాలలో, సిరద్దారు తిట్లల్లో, పార్టీల లంచాలలో, చచ్చిన నా రసికభావం అంతా ఒక్కసారిగా, మొదటి సాయంత్రమే తీవ్రంగా మేలుకుంది. పిండివంటలు తింటే కలిగే వుత్త సాధారణ కామమనుకోకు. యేదో గదిలో రహస్యంగా ఒక్కదాన్ని లంకించుకుని తొరతొరగా నాలుగు నిమిషాల్లో తృప్తిపడి అయిపోయింతరవాత దానిమొహం చూడలేనంత అసహ్యపడి, తలుపుతీసి, యెవరూలేకుండా యిటూ అటూ చూసి యెవరిదోవనవారు తప్పించుకొని పోవడంకాదు. చెప్పనా? నా హృదయంలోని, ఆనాటి వాంఛ, చెప్పగలనా! చెరువులో కలువలు చప్పుడు కాకుండా విచ్చేటప్పుడు, వుదయించే చంద్రుడి కిరణాలు ఆ వొడ్డునించి తరగల్లో తేలి, ఈవొడ్డుకు ఈదేప్పుడు, ఆలస్యమైన ఆవునిపిలిచే గొల్లదాని కేక మా చెవులకి తగిలేవేళ,

ముడిలో యిమడక చల్లగాలిలో కదిలేజుట్టు మెడకి చక్కిలిగింతలు పెడుతో వుండగా, గుండ్రని బలువైన రొమ్ముని నాకు పక్కగా ఆనించి, చిరునవ్వుతో సగంమూసిన కళ్ళతో నావంక చూస్తో కూచోవాలి నా ప్రణయ ప్రేయసి—

యిట్లాంటికోర్కె అక్కడ సహజంగా కలుగుతుంది జీవమున్న ప్రతి మానవుడికీ. దాన్ని ఎంత ప్రయత్నించినా అణుచుకోలేక పోయినాను. నాకు మర్యాదంటే చాలా యిష్టం; అల్లరీ అపవాదూ చాలా అసహ్యం; స్వభావం పిరికి; అవును! మనవూళ్లో యిట్లాంటి వూహాలు కలిగేవే కావు. ఏదో పనిచేసుకోడం, పడుకోడం, భోజనంతోపాటు ఆ మొక్కూ తీర్చుకోడం. తోడిగుమాస్తాలతో తిరగడం, సంతృప్తిగానే వుండేది. డబ్బుబాధతప్ప యింకోబాధ యెరగను. కాని ఆ గాలిలో అట్లాంటి సుందరమైన ఆలోచనల్ని అణుచుకోడం నాతరం కాలేదు. నాతరమేకాదు, నన్ను పుట్టించిన ఈశ్వరుడితరంకాదు. ఈ భార్యాభర్తల యథావిధీ, అభ్యాసపూర్వకమైన నీతిని ఏర్పరచిన దౌర్భాగ్యుల తరంకాదు.

కోనసీమ చూశారుకాదూ! ఈవేపుకాలవా, ఆ వేపు యింద్రసభవంటి తోటా, మధ్య రోడ్డూ, ఆవుదయం మంచుబొట్లతో సింగారించుకున్న తోట అందాన్ని కొత్త సూర్యుడు యేటినీళ్ళకు చూపించి నవ్వుతున్నాడు. గలగల మని తూములోంచి పడే నీళ్లని పోలిన నవ్వు నాహృదయం లోంచి దూసుకుపోయింది. ఎవరితోనో ఒక్కొక్కమాట

అనడమూ, గుక్క తిప్పలేకుండా నవ్వడం. అట్లానే రోడ్డు మధ్య నుంచుని విన్నాను. కొంచెంసేపట్లో పాట మొదలు పెట్టింది. ఒకముక్క పాడడం, ఆపుకోలేక ఆపుకోలేక నవ్వడం; ఆమె యెన్నడన్నా విచారమనేది ఎరుగునా ? ఏ విచారం ఆమెకి జీవితంలో కలిగినా ఈ ఆనంద ప్రవాహంలో తృణాగ్నివలె ఆరిపోదా అనిపించింది. ఆ వుదయ కాంతిలో, నూతన పుష్పాల్లో, నీళ్ళ నిర్మలత్వంలో, పక్షుల ప్రేమగానాల్లో ఆనవ్వూ సహజంగా కలిసిపోయింది. ఆ నవ్వుతో గాలీ, పువ్వులూ కొబ్బరిచెట్లూ వూగినట్లయింది. పదిహేను నిమిషాల తరవాత గావును' ఒక ముసలిసాహెబుతో నవ్వుతో మాట్లాడుతో పాడుతో తోటచెట్లలోనించి నడిచివొచ్చి నాకు కనపడ్డది. ఆమెకి యిరవైయేళ్లు దాటివుంటాయి. ఎర్రనిచీర కట్టింది. తోటకీ రోడ్డుకీ మధ్యవున్న కాలవదగ్గిరికి వొచ్చి, దాటడానికి తొడలపైకి చీరనెత్తి దిగింది. నేను చూస్తున్నానన్న లక్ష్యమే ఆమెకి లేనట్టుంది. అటువంటి శరీరచ్ఛాయని నేక్కడా చూడలేదు. ఆమె రవికె వేసుకోలేదు. చీరె పమిట వక్షాన్ని కప్పుతోంది. ఆమె వొంటిరంగును చూడగానే నక్షత్రపుకాంతితో మెరిసే నల్లని అమావాస్యనాటి ఆకాశపు నల్లని తేజస్సు స్ఫురించి తీరుతుంది. ఆప్రకాశంముందు మంచువలె తెల్లనైనదనీ, బంగారువలె పచ్చనైనదనీ, మనము చదివిన వర్ణనలు హేళనగా తోస్తాయి. చిన్న దుమ్ముపలుకు మీదపడినా ఆ బలిసి నిగనిగలాడే నునుపు మీదపడి జారిపోతుంది. ఎండ ఆమె బుజంమీదపడి ప్రతి

ఫలించి జారి యిటూ అటూ తిరిగి వొదలక అల్లరిచేస్తోంది. ఆ బుజాల వంపులువున్నాయి, మహాప్రభూ! గుండ్రంగా నున్నగా! తలుచుకుంటే మనసంతా వాంఛతో వుడికి పోతుంది. చేతులు తిమ్మెర్లుఎత్తి లాక్కుపోతాయి. ఆమె తొడలముందువేపు నల్లగా వున్నాయి. కాని లోపలికి తిరిగినకొద్దీ ఆనలుపు మెరుగెక్కువై, నేవళమధికమై, ఆనునుపు మీదచూపునిలవలేకధగధగలాడేతెలుపేమో అనిపిస్తుంది.

ఇంటిగుమ్మంలోకి వొచ్చేటప్పటికి పెద్దకడుపూ, సన్నని చేతులూ, మెడా, దించుకుపోయిన దవడలతో నా భార్య "ప్రొద్దున్నే ఎక్కడికెళ్ళారు?" అని—

అడగడం వినిపించుకోక, వెంటవచ్చి యింకా నాకు కనబడుతోనే వుంటుందేమోననే భయంతో లోపలికి పరిగెత్తాను. నా భార్య అందమైన స్త్రీలలో లెఖ్ఖ మన వూళ్లో. కళాశాస్త్రప్రకారం కులధర్మశాస్త్ర ప్రకారం అన్నిలక్షణాలూ వున్నాయి. ఆ కడుపులేనప్పుడు అందమైన ఆ పిడికెడు నడుమే. కాని అన్నీ పిడికెడే అయితే యెట్లా భరించడం? మళ్ళీ యీ నాభార్య ప్రతివ్రతాతిలకం. ఆ మనిషిని చూస్తే వుమ్మివేస్తుంది, అనుకుంటా. ఆమెకోసం నా భార్యను ఆరాత్రే గొంతు పిసకడం అవసరమైతే ఆపని చేసేవాణ్ణే. అంత పిచ్చెక్కింది. "నీజీవితంలో గవర్నరయ్యే జాతకంవుంది. దాన్ని యీ అమ్మాయికోసం వొదులుకుంటావా?" అంటే వెంటనే సంతకం చేసేవాణ్ణే.

ఇంట్లో కాలునిలవక మళ్ళీ మధ్యాన్నమే బైలుదేరాను, కాని వాన అడ్డంవచ్చింది. వానపోయి యెండ

కాసిన సాయంత్రాలెంత అందంగా వుంటాయి. రోషంతో మేడ్చి నవ్విన స్త్రీల ముఖాలవలె! రోడ్లమీద నీళ్ళు మడుగులు కట్టాయి. చెట్లూ పిట్టలూ నీటిచుక్కల్ని విది లించుకుంటున్నాయి. సంతోషంతో గాలి అన్నిచోట్లకీ అతివేగంతో పరిగెత్తుతోంది, ప్రైవేటు టీచరునించి తప్పిం చుకున్న కుర్రవాడులాగ. ఆమెని మళ్ళా చూడాలనే కోర్కె తీవ్రమయింది. ఆమె స్నేహమే లభిస్తే! ఇంకేం కావాలి నాకు జీవితంలో? నాచెయ్యిని ఆనున్నతనంమీద, ఆ గుండ్రతనంమీద, ఆమెరుగుమీద, రాయగలిగితే! ఆ తల వంకరపోయినాయి. నావేళ్ళుఆమెతో మధ్యాన్నం కొబ్బరి చెట్ల కదిలే నీడలక్రింద, ప్రవహించే చల్లని నీళ్ళవొడ్డున గడ్డిమీద, నీళ్ళతో బలువైనగాలి ఆమె పైటచెరగును కదిలిస్తోవుండగా, నాకై ప్రేమతోనిండిన ఆమెకళ్ళ పక్కచూ పులతో పరవశుణ్ణయి—యింక ఆ అనుభవం తరవాత యెన్నాళ్ళు గుమాస్తాపని చేస్తేనేం? శిరద్దారు తిడుతో వుంటే—

"నిర్భాగ్యుడా, జీవితం అంటే, రసమంటే, ఆనంద మంటే నువ్వేం యెరుగుదువు?" అని నా మనసులో నేను గర్వపడవచ్చుకదా?

మళ్ళీ ఆతోట కెదురుగా నుంచున్నాను. చడీ చప్పుడూ లేదు. అరగంటైన తరవాత నా గజయాన యెక్కణ్ణించో వొస్తోంది రోడ్డుమీదనించి. పల్లెటూరు వాళ్ళతో మాట్లాడం యెంతసేపు! యేంమాట్లాడితేనేం స్నేహమయింది. చిన్నమాటలు చిన్ననవ్వులైనాయి.

"ఇక్కడంతా బురద, తడి అట్లా నుంచోండి" అని, వాళ్ళ తోటపక్కనవున్న ఫ్యాక్టరీ వరండామీదికి తీసుకువెళ్ళింది. అక్కడ నుంచుని మాట్లాడాము. ఏమిటో అఖ్ఖర్లేనివన్నీ. కొమ్మమీద కూచుని సల్లాపాలాడుకునే చిలకలమాటలకి అర్థముండాలా! అంత దగ్గరగా నుంచోటమే చాలు. ఆ మొహంలోని ఆలోచన చూస్తేనే చాలు. ఆ పెదవుల్లోనించి తెల్లనిపళ్ళుకనిస్తో మాట్లాడ్డం, నవ్వడమే చాలు. వుండుండి నావంక కొంచెంగా కళ్ళెత్తిచూడటం, గోడపక్కనించి వొంగి రోడ్డుకేసి భయంతో చూడడమూ, బుజంనించి కిందికి జారిన పమిటెని సద్దుకోడం, ఇవి చాలవూ!

"రోడ్డుమీద వెళ్ళేవాళ్ళందరూ మననిచూసి యేమనుకుంటున్నారో? ప్రజల నాలికలు మంచివికావు. ఇట్లారండి" అని గోడపక్కగా నన్ను నుంచోపెట్టింది.

"మొదట మీరు టపా సాయేబనుకున్నా, అతను తరుచూ ఇట్లా వెదుతోవుంటాడులెండి. బ్రాహ్మలా—" అని కలకలమని నవ్వింది. ఆనవ్వు నా హృదయంలో ప్రవేశించి ఆ సాహేబు విషయమై నేను పడుతున్న ఈర్ష్యావస్థని మింగి విజృంభించి నన్ను వశపరచుకుంది. యేం చెయ్యను? ఆ నవ్వు నెట్లా నాదిగా చేసుకోడం! ఆనవ్వే పెదవుల్ని ముద్దుపెట్టుకున్నా, వొణికేకంఠాన్ని చేత్తో స్పృశించినా, ఆవూగే హృదయాన్ని అదుముకున్నా, తృప్తి కలుగుతుందా? కాని మధ్య సాహేటు ఒకడు వచ్చాడుకద! వాణ్ణి చిత్రవధచేసి చీల్చి కాల్చి, నలిపి,....

కథా నిలయం

"ఎందుకండీ నాతో యింతసేపు మాట్లాడుతున్నారు. మీ పనులన్నీ చెడుపుకుని ?"

"నీమీద సరదాగనక !"

"నామీద ఏం సరదాండి! బీదవాళ్ళం. మంచి బట్టలా, నగలా చూడండి. యీ నల్లదనం, యీ మోటు తనం !"

నాదగ్గిరగా చేతులు జాచింది. వాటిని అక్కడే గట్టిగా పట్టుకుని తాకి రాసి నా చేతుల్ని వాటిమీద నున్నగా జార్చి...."ఇప్పుడే కదులు, తాకు" అనిపించింది గాని....యేమంటుందో! అట్లానే అనేకసార్లు ఆ పదినిమి షాల్లో ఆశగలిగింది. మళ్ళీ భయపడి వూరుకున్నాను.

ఆ ఆశతో తలతిరిగి నేను తాకినట్లే అయ్యేది నా మనసు. "అంతే యిట్లా ఆలోచిస్తోనే వుంటావు, యెవరో వస్తారు; కాలం అయిపోతుంది. ఏం భయంలేదు. ధైర్యం చెయ్యి" అంటోంది హృదయం. కానిసాహసం కలగలేదు. రోడ్డుమీదవాళ్ళు వొస్తే ఎట్లా ?ఇందాక తలుచుకున్న తోటా, నీళ్ళు జ్ఞాపకంవచ్చి—

"అది మీ తోటేనా ?" అన్నాను.

"తోట చూస్తారా ! రండి" అని—

నన్ను సంతోషంతో వెంటబెట్టుకుని ముందు నడి చింది. నడుస్తోవుంటే ఆ పిరుదులు కదలడం, ఆ పక్క వొంపుల నున్నదనం, యేం చెయ్యను ? యింతకాలం యెక్కడ బతికాను నేను ? అనిపించింది.

"గండుచీమలు, ఇట్లారండి"

చప్పున నన్ను పక్కకి లాగింది. కావలిసేనా?

యిద్దరం దట్టమైన మందార మొక్క వెనక నుంచు న్నాము. రెండు పువ్వులుకోసి తలలో పెట్టుకుంది. తలలో వేళ్ళు పెట్టుకోడానికి చేతులెత్తితే సాగిన ఆ కండరాల వుబుకు, ఆ గట్టితనం! ఇంక అన్ని అనుమానాలూ, భయాలూ యెగిరిపోయినాయి. ఆమెచేతులు వొంచగానే రెండుచేతులతో ఆమె రెండుజబ్బలూ గట్టిగా పట్టు కున్నాను. వాటి గట్టిమాంసం నావేళ్ళకి ఎదురుతిరిగింది. యెంత గట్టగా వొత్తినా వెచ్చగా. నున్నగా, గట్టిగా.... నువ్వెప్పుడన్నా అనుభవించావోలేదో ఆ సౌఖ్యం! యీ పొయ్యికాడి భార్యలందరూ చేతుల్లో యెక్కడో అణిగి, వొంగి, నలిగిపోతారు. గాఢమైన మోహంతో గట్టిగా కావిలించుకోగానే, "ఉస్, కస్, అబ్బా నొప్పి, అబ్బా అక్కడ వొద్దు, అబ్బా, వొదలండి" అని—

వొదలగానే వెధవ వెకిలి నవ్వుతో చచ్చుసిగ్గు ప్రయత్నించి కుళ్ళుమాటలతో "మరీని! పూరిఖే! ఏమిటా మోటసరసం! అబ్బా, ఎహ్" అంటే—

నీ ప్రాణ మెట్లావుంటుందో ఆలోచించుకో. గట్టిగా, గర్వంగా, బలంగా, చేవగా—

యేం చెప్పను! ఎంతచెపితే అర్థమౌతుంది? ఆ ఐదు నిమిషాలు ఎట్లావున్నానో! ఏమైనానో! ఆమె వొదిలించు కోవాలని పెనుగులాడినకొద్దీ, నేనాక్రమించుకున్నాను.

చేతులు జారిపోతున్నాయి. నాబలం యెందుకూ కొరగాకుండా పోతోంది. ఆమె వొంటినించి సహజమైన, నైసర్గికమైన వాసన నాతల తిప్పేసింది. ఆ నిమిషాలకుబదులు నిరంతరజీవనం, దేవత్వం యిచ్చినా నాకు వొద్దు. మనం కొని భద్రంగా వాడే ఆ సాహేబుల బుడ్లలోని ఆ కుళ్ళు అత్తరునూనెలెందుకు? భద్రంగా ఆకులోచుట్టి పొడుం పొట్లంతోపాటు జేబులో పడేసుకుని, బజారునించి అరగంట బేరంచేసి, అర్ధణాకు కొనితెచ్చుకునే చెన్నపట్నపు రైలు కంపు దవనంవాసన యెందుకు? గజకుంభాల్లోని మదపు వాసనా, బలిసి శుభ్రమైన ఆవుల్నించివొచ్చే వుత్తమ గోరోజన పరిమళమూ, వానకురిసినప్పుడు పచ్చని గడ్డిలోంచి పన్నీరు పువ్వుల్లోంచి కొత్తగా తవ్విన మట్టిపెళ్ళల్లోంచివొచ్చే సౌరభం, కస్తూరిమృగపు అద్వితీయ గంధం, అన్నీ తలపుకు వొచ్చాయి నాకు. ఆమె సన్నిహితంలో. ఆమె నన్ను తోసేసి తప్పించుకుని, కోపం తెచ్చుకుని—

"నన్ను తాకకండి" అని నుంచుంది. నామొహంలో ఆశ్చర్యాన్నీ నిరాశనీ చూసిందేమో! ఒక్క అడుగు వెనక్కివేసి, అటుతిరిగి నవ్వుతో కొట్టుదగ్గిరికి పరిగెత్తింది. చిన్న ఆవుపెయ్యి పరుగును పోలిన ఆ అందమైన వేగాన్ని చూస్తో వెనకనే వెళ్ళాను. దగ్గిరిగా రానిచ్చి నన్ను ఆను కున్నట్టుగా వొంగి—

"నేను అట్లాంటిమనిషిని కానండీ"

అని గోముగా అంది. మళ్ళీ నవ్వింది విచిత్రంగా. నేను నుంచున్నాను. నాతలతిరుగుతోంది. కళ్ళు మూతలు పడుతున్నాయి. లోకంమీది నిర్లక్ష్యం ఎక్కువవుతోంది. ఆమెకళ్లు నన్నుచూసి నవ్వుతున్నాయి. ఆ దేహమే పెద్ద నవ్వు—

"ఈ గదుల్లోనండి .... రాత్రైతేసరి. యిద్దరిద్దరు (నవ్వుతో) పో.... తారు....ఛీ ఛీ.... వీళ్ళకి సిగ్గు—అభిమానం—యేమీ లేవు"

నాకు ఒకటే ఆశ్చర్యంగావుంది. యెవరీవ్యక్తి? ఇది అంతా కపటమా, అమాయకమా?

"మీవంటివారు నన్నూ అట్లాంటిదాన్నే అనుకుంటారు. నేను యెన్నడూ ఎరగను. మర్యాదస్తులమండి. మీతో యిట్లా మాట్లాడగానే చులకనైనట్టున్నాను. అదుగో మళ్ళీ యేం? చేతులూరుకోవూ? ఎవరనుకున్నావు? అక్కడేఆగండి. చెపుతూవుంటే! తెలీటంలా?"

నా కళ్ళలో నిరాశో దిగులో ఏదో చూసిందిగావును ఆమెని వొదిలి ఏమి చెయ్యడానికీ తోచక దూరంగా నుంచున్న నా వెర్రితనాన్ని చూసి దగ్గిరిగా వొచ్చి తనకేం తెలీనట్లు ఎక్కడోచూస్తో తన గట్టి రొమ్ముపక్కగా నా బుజానికి తగిలిస్తో, నల్లని మెరిసేచేతిని నా తెల్ల షర్టుమీద నించి అడ్డంగా జేబుదగ్గిరికి పోనిచ్చి మోకాలుతో నా నాకాలుని అదిమి—

"రాత్రికి బియ్యానికి ఏంలేదు. యామన్నాయిస్తే ...." అంది. నాప్రాణం చివుక్కుమని మొహం తిప్పేశాను.

ఆ స్వప్నమంతా ఆ వొక్కమాటతో మట్టిపాలయింది. ఎంత 'రోమాన్సు' ఎంత సృష్టి సౌందర్యాన్ని, భావించుకున్నానో అంత నీచత్వమూ నా మనసుని విరిచింది. ఇంత సౌందర్యమూ, యిట్టాంటి పనుల్లో వుపయోగడుతోందా- అనుకున్నానుగాని, ఆమె మొహంచూస్తే మాత్రం, మనుష్యుల రక్తం పీల్చి కొవ్వెక్కి నగలలోను, మేడల్లోను, తృప్తిపడే పట్టణపు పిశాచుల రక్తమేనని విశ్వసించలేకపోయినాను. ఇంత నా మనసు చివుక్కుమన్నా ఆమెని వొదిలివెళ్ళాలని బుద్ధిపుట్టడంలేదు. నిజంగానే రాత్రిభోజనానికి డబ్బు అవసరమేమో పాపం! అని అనుకుంటో వుండగానే, రోడ్డుమీదనించి ముసలామె వొచ్చి మా యిద్దర్నీ చూసింది.

"ఏమిటే చేస్తున్నావిక్కడ? ఈయనెవరు?"

ఇదేమిటి? తనని బలవంతం చేస్తున్నానని చెప్తాతుందా? నన్ను వెక్కిరించి నవ్వుతుందా? అక్కడికి యెందుకు వెళ్ళానా, అనుకొని భయపడుతున్నాను. పోట్లాటా, ఆమెభర్తా, గుంపూ మా అత్తవారిదాకా తెలీడం, మాదిగదాన్ని—నాకు వొణుకుపుట్టింది.

"ఏంలేదు. తోట చూస్తానన్నారు" అంది.

ముసలిది కోపంతో—

"మొగాళ్ళతో నీకేంపని? పద, ముందు; తోటలు చూస్తాట్ట!"

అమ్మాయి సంశయిస్తో నుంచుంది.

"నడుస్తావా ? మీ అయ్యతో చెప్పి వీపు చీల్పించనా ?"

"కోప్పడకమ్మా ! ఈయన అట్లాంటిమనిషికాడు."

ఆ మాటతో ఏమనుకుందో, ఏమర్థమయిందో, ఆ ముసిలిది తగ్గి నడవడం మొదలుపెట్టింది.

"పెద్దమనుసులు. కనపట్టంలేదూ ? అన్యాయంగా ఆగ్రహిస్తున్నావు" అంది మళ్ళీ.

"సరేలే. కాని యింటో బియ్యంలేవు. పోయి సంపాయించుకురా. పెద్దమనిషితో మాట్లాడుతుంటే కడుపు నిండుతుందా ? పెద్దమనుషులు ! అందరూ పెద్దమనుషులే!"

అనుకుంటో వెళ్ళింది.

"మా అమ్మ."

"నిజంగా మీకు తిండిలేదా ? ఈతోటా...."

"మక్కా. అంతా నష్టమేనండి ఈయేడు...."

జేబులోంచితీసి ఐదురూపాయలనోటు ఇచ్చాను.

"ఇట్టా లోపలికిరండి"

"నేను వెడతాను."

"ఇప్పుడు రారా ? ఎప్పుడొస్తారు ?"

"నేను రాను."

"ఏం ?"

"ఎందుకు ! నాకేం పనిలేదు."

"ఈవేళ పనివుండే వచ్చారా ?"

నాకు కోపం హెచ్చుతోంది.

"నువ్విట్లాంటిదాని వనుకోలేదు."

"ఎట్టాంటిదాన్ని ?"

"సామ్మికు గడ్డితినేదానివి"

పెదిమ కొరుక్కుని, కళ్లు తళతళమంటో నాకేసి చూసి తలవొంచుకుంది.... అంతా నిశ్శబ్దం.

"ఐతే సామ్మెందు కిచ్చారు ?" కంఠం వొణుకుతోంది.

"మీకు తిండిలేదుగా !"

మాట్టాడకండా నుంచుంది. వొంచుకునివున్న కళ్ళల్లోంచి రెండు చుక్కలు పమిటమెత్తుమీదపడి చిందాయి. కోకిల వూరికే ఆత్రుతతో కూస్తోంది. నీళ్ళతో నిండిన గాలివీచింది. సూర్యుడి చివరకాంతి యెర్రగా ఆమెచేతులమీద పడుతోంది. ఆమెతల్లో పువ్వుచుట్టూ జుట్టు వుంగరాలు మూగాయి. మళ్ళీ ఆమె అందం, ఆమె మొహం, నన్నాకర్షిస్తున్నాయి. ఆ విచారాన్ని నేనాట్టేసేపు "రెసిస్టు" చెయ్యలేను. అప్రయత్నంగా నా పెదవులు ఆమెకళ్ళను వోదారుస్తాయి. ఆమె హృదయాన్ని జయించానని ఆశ పడుతూవుండగా, నన్ను డబ్బుడిగిందే, అనే అహంభావానికి కలిగిన గాయం నన్ను అమితంగా బాధపెడుతోంది. వెళ్ళేట్టు కదిలాను.

"సరే వెడుదురుగాని, ఒక్కసారి ఇట్టారండి. మీతో ఒక్కమాట చెప్పాలి."

"ఇక్కడ చెప్పరాదూ ?"

"కాదు. రండి."

"ఇక్కడ చెపుదూ?"

వూరుకుంది.

"భయమా!" అంది. ఆ కంఠంలో "ఛాలెంజి" నేను గ్రహించలేక పోయాను.

"సరే, పద."

తలుపుతీసి గదిలోకి వెళ్ళి, గడియవేసింది. ఎవరు వొస్తారో, తలుపు తడతారో అని నాకు సిగ్గేసింది. కాని పైకేమీ కనపరచ తలుచుకోలేదు. ఆ గదిలో మూల మంచమూ, దానిమీద జంపకానా, మురికి తలగడా, మూల పెద్దకుండా, కిందంతా బీడీపీకలూ వున్నాయి.

"ఏమిటి?"

చిరునవ్వుతో, నాదగ్గిరిగా వస్తో, పమిటని చమత్కారంగా దానంతటదాన్నే జారనిచ్చి, నాచేతిని పట్టుకుని తన రొమ్ముమీద ఆనించుకుంది. ఆ గదీ, ఆ పక్కా, ఎవడో కాల్చివేసిన ఆ బీడీపీకలూ, అడ్డపడ్డాయిగాని, లేకపోతే లోహంవలె నిగనిగమెరిసే, ఆ వెచ్చని గట్టి వక్షం మీదనించి నాచెయ్యి తిరిగి వొచ్చునా? గర్వంగా పైకి తిరిగి, కొవ్వెక్కివున్న ఆ సౌందర్యాన్ని చూడనా? ఆ చుట్టుపక్కల తీరైన గుండ్రని వొంపుతో కలకలలాడే ఆ మెడనీ, పొట్టనీ, చేతుల్నీ చూడనా? ఆ దృశ్యంతో నా జన్మానికి కావలసిన సౌందర్యమంతా పొందానని పించింది.

"వొద్దు" అన్నాను కష్టంతో చెయ్యితీసేసి.

"మీ రెందుకు నన్ను తాకారు యిందాకా!"

అని కళ్ళతో పోట్లాడింది. వెక్కిరించింది. సవాలుచేసింది.

"నీకు డబ్బు దొరికిందిగా! ఇంకా నాతో నేంపని!"

"అంత నీచురాల్నికాదు."

మళ్ళీ కన్నీళ్లు కళ్ళల్లో నిండాయి. ఆ పెదవి లోపలికి పోతోంది. ఏంచెయ్యను? ఇంక నామనసు స్వాధీనం తప్పుతోంది. వెళ్ళబోయినాను. చెయ్యిజాచి నానోటు నాచేతుల్లో పెట్టి మూసింది. చెయ్యి జాచినప్పటి బుజందగ్గరి గొప్పతనం నాకళ్ళనీ, కాళ్లనీ ఆపింది.

"మరి రాత్రి భోజనం?"

కళ్లతో కాల్చేట్టు నావంక చూసింది.

"నామీద కోపమా?"

"మావంటి నీచులకి కోపంవొస్తే నేం లెఖ్ఖ!"

"అదుగో కోపం!"

"నాకేం కోపంలేదు. వెళ్ళండి."

"ఈనోటు తీసుకో."

"డబ్బు వుచితంగా తీసుకునే గతికి రాలేదు."

"అట్లా తీసుకోడంకంటె అన్యాయమా?"

కొంచెం వూరుకుంది.

"నీ స్నేహితుణ్ణి, నీకు యిస్తున్నాను. బహుమతి ఇస్తున్నాను, పాపం నువ్వు పస్తుపడుకున్నావనే దిగులుతో — తీసుకో."

అని ప్రేమతో ఆమె చెంపమీద చెయ్యేసి, ముఖం పైకెత్తి చూశాను. ఆమె చప్పున రెండుచేతులూ మొహం మీద పెట్టుకుని యేడ్చింది. ఆ తుపానువొస్తుందని ఎదురు

చూస్తోనేవున్నాను. ప్రతి కన్నీటి చుక్కనీ, తడి అవుతున్న కనురెప్పల్నీ ముద్దులతో తుడిచి, పక్కన కూచుని అడిగాను.

"ఎందుకు ఏడుస్తావు?

చాలాసేపు చెప్పక తిప్పలుపెట్టింది. కాని నాతో యేదో చెప్పాలనే వుద్దేశ్యంతోనే వుందని నాకు తెలుసు.

"నేనాడబ్బడిగింది నాకోస మనుకున్నారా? నా వృత్తి, నా జీవనం అదే, కాని నాకిష్టమా? .... నన్ను నా మేనత్త కొడుక్కే యిచ్చి పెళ్ళిచేశారు. మొదటినించీ మాయింటో మాకీతోటవల్లవచ్చే ఆదాయంకన్న సుఖంగా బతకడం మామూలు. ఇప్పుడాలోచిస్తే ఆ పైఖర్చు మా అమ్మ సంపాయించేదేమోనని అనుమానం. నాకు బుద్ధి తెలిసినప్పణ్ణించి మేము అలివిగాని అప్పుల్లో వుండేవాళ్ళం, ఎవళ్ళెవళ్ళో రహస్యాలు మాట్లాడడం, వెళ్ళడం, ఏవో కాయితాలూ, తగాదాలూ, జరుగుతోనే వుండేవి. ఒక రోజురాత్రి నాతో ఏం చెప్పకండానే అమ్మ నన్ను వెంకయ్యకి వప్పచెప్పింది. వెంకయ్య మా కులంవాడే. అదేదో దేశంలో లేసులవర్తకంచేసి డబ్బు సంపాయించాడు. అతనికి మేము ఏడువందలు బాకీ. నేను నిద్రపోతూవుండగా వొచ్చి పట్టుకున్నాడు. చప్పున లేచి అరిచాను. కాని నాన్ననిగూడా తీసుకుని అమ్మ యెక్కడికో వెళ్ళింది. అమ్మ చెప్పినమాటకి యెదురాడడం నాన్నకెన్నడూ లేదు.

నాకట్లాంటిదికొత్త. అప్పుడు ఏమీ అర్థంగాక వాణ్ణితోసి యీ తోటంతా పరిగెత్తాను.... వాడు వెనకా

నేను ముందూ. ఆ వెన్నెట్లో యీచెట్లల్లో యెట్లా పరిగెత్తా నని! అదే చీకటైతే వాడికిదొరికేదాన్నా! చివరికి ఆపుల్ల రేగిపొద వెనక వగరుస్తున్న నన్ను పట్టుకుని కిందపడేశాడు. అప్పటికీ నా వూపిరి చివరవరకు పోట్లాడాను. ఇంక శక్తి లేక అతనికేసి చూస్తో కాళ్లూ చేతులు వేళ్ళాడేసి పడుకున్నాను. ఏమనుకున్నాడో యేమో నాతలని కింద నేసి బాది మీాద వుమ్మేసి. అమ్మనీ, నాన్ననీ తిడుతో బెదిరిస్తో వెళ్ళిపోయినాడు. కదిలే శక్తి లేక అక్కడే పడి వున్నాను, బట్టన్నా సరిగా వొంటిమీాద లేకండా. అరగం టలో అమ్మవొచ్చి నన్ను కొట్టడం ప్రారంభించింది. వాడికి లోబడ్డందు కనుకుని, వాడు నన్నేం చెయ్యలేదని అరిచాను. ఆమాట అనేప్పటికల్లా మరీ కొట్టింది. ఆ "ఐదు వందలూ ఎవరు తీరుస్తారు. నీ మొగుడువొచ్చి రక్షిస్తాడా" అని మళ్ళీ కొట్టింది. ఏంరాత్రి అబ్బా అది! మర్నాడు రాత్రి వాడు వొచ్చాడు. నన్నుతాకితే చంపుతానన్నాను. అమ్మ నన్ను యింటోంచి వెళ్లకొట్టింది. నా మొగుడు రంగూను వెళ్లాడు. కనక నాకు దిక్కులేదు.

అప్పుడే ఈ ఫ్యాక్టరీ కడుతున్నారు. కూలికి కుది రాను. ఒకనాడు ఆ మేస్త్రీ చిల్లరలేదని కూలీ యివ్వడం ఆలస్యంచేసి చీకటిపడ్డదాకా వుంచాడు. నాకు భయ మేసింది, వెళ్లాలనిపించింది, కాని ఈ డబ్బులు తీసుకు వెళ్ళకపోతే తిండిలేదు. నన్నా మొండిగోడలమధ్య పట్టు కున్నాడు. వాడినెత్తిమీాద రాయి విసిరికొట్టి పరిగెత్తాను.

వాడికి దెబ్బతగిలిందో, చచ్చాడో అని రాత్రంతా పోలీసు వాళ్లు వస్తారనే భయపడుతోనే వున్నాను. ఆరాత్రి తిండి లేదు. భయం. ఎక్కడెక్కడో తిరిగాను. మర్నాడు చెట్టు కింద పడుకునివుంటే నాకు తెలిసినదొకత్తె వడ్లమరలోకి పనికి తీసికెళ్ళింది. వెళ్ళినరోజునించి, ఆ మరాయన బ్రాహ్మడు నన్నెగాదిగా చూడడం, నన్ను వృధాగా పలకరించడమూ, చూసి యెంతో భయమేసింది. ఇంక ఈ మొగాళ్ళనించి తప్పించుకోలేనా? యీ అందం నాకెక్కడ దాపరించింది? బైటికి వెడితే మొగాళ్లు నావంక తేరిబార చూడడమే! ఇదివరకు నాకాచూపుల అర్థం తెలీలేదు. తురకాళ్ళు వాళ్ల ఆడవాళ్లకి బురకా లెందుకు వేస్తారో అప్పు డర్థమయింది నాకు. కొందరిచూపులు, తాకడంకంటే కూడా, ఇంకేమో చెయ్యడంకన్నాకూడా అసహ్యంగా, దుర్భరంగా వుంటాయి. ఒక్కొక్కడు నావంక చూస్తే, యెదురుగా వెళ్ళి మొహంమీద వుమ్మెయ్యా లనిపించేది. ఆ మరలో వారానికొకసారిగాని కూలివ్వరు. ఆ వారం రోజులూ నన్ను తీసికెళ్ళిన మనిషిదగ్గిర బదులుచేసి తిన్నాను. ఆఖరురోజున మర రాత్రి పనిచేస్తున్నది రమ్మన్నాడు. రాత్రులు వీల్లేదన్నాను. రాకపోతే నీ జీతం అసలివ్వను పొమ్మన్నాడు. దీని అప్పెట్లా తీర్చను? భయపడుతోనే వెళ్ళాను. తక్కిన మనుషు లెవరూ రాలేదు. ఆయనవొచ్చి నాచెయ్యి పట్టుకున్నాడు. నే నట్టాంటిదాన్ని కానన్నాను. నన్నా ఫ్యాక్టరీలోకి లాక్కెడుతున్నాడు. నేను మాలదాన్ని, నువ్వు బ్రాహ్మడివి, ఇది తగదన్నా

వినలేదు. పైగా ఐదు రూపాయలు చేతులో పెట్టాడు. అరిచినా చుట్టూ ఎవరూలేరు. వాళ్ళ యిల్లొక్కటే అక్కడ. దీపం తలుపులోంచి కనపడుతోంది. చప్పున చెయ్యి వొదిలించుకొని పరిగెత్తాను. ఆయనతల్లీ భార్యా వున్నారు. ఏడుస్తో వాళ్ళ కాళ్ళముందు పడ్డాను.

"ఛీ, ఛీ, మాలదానివి పొమ్మ"ని లేచారు.

"యీ మాలదాన్ని పట్టుకునే మీ కొడుకు సంగతేమిటి ?" అన్నాను.

ఆ మహాతల్లి కత్తిపీట విసిరివేసింది. ఆయన ఇంతలో నాకోసం వచ్చాడు. వాళ్ళముందే వాళ్ళిద్దరిముందే నన్ను పట్టుకోబోయినాడు. కత్తిపీటతీసి వాడిమీాద విసిరివేశాను. ఏమయిందో! పరిగెత్తాను. అర్ధరాత్రి పోలీసులు నన్ను పట్టుకున్నారు. ఆ బ్రాహ్మడి మొహం తెగిందట. పైగా వెండిగిన్నె యెత్తికెళ్ళానన్నారు. ఆరాత్రి కైదులో మకాం. మర్నాడు ఒక ఇన్స్పెక్టరు ప్రశ్నలడిగాడు. నేను జరిగినది చెప్పాను. వాళ్ళేదో మాట్లాడుకుని నన్ను మళ్ళీ తాళంవేశారు. ఆ కైదూ, ఆ పోలీసులూ, నాకు భయంగావుంది. దిక్కులేదు, నన్ను చంపుతారో యేమో ! ఇంకెన్నడన్నా వొదులుతారో లేదో ! ఎప్పుడూ గాలిలో, చెట్లకింద తిరిగే నాకు ఆ కొట్టు యెట్లావుందని ! చావనన్నా చస్తాను. కాని ప్రతి నిమిషమూ వూపిరి బిగపట్టి ప్రాణాలు బిగించే ఆ కొట్టులో కూచోలేను. ఆ సాయంత్రం యిన్స్పెక్టరు కాళ్ళమీాదపడి యేడ్చాను, నన్ను వొదలమని. ఆరాత్రి పోలీసు అతను నాగదికి వచ్చి

బలవంతం చేశాడు. నన్ను వొదిలిపెట్టడం తనచేతులోనే వుందనీ, వొప్పుకుంటే మర్నాడు పొద్దునే ఇన్‌స్పెక్టరుతో చెప్పి వొదిలిస్తానన్నాడు. ఏమైనాసరే, ఏపాపం చేసైనా సరే, బైటపడాలనిపించింది. కాని నేనెంత వొప్పించినా సిగ్గు తిరగబడ్డది. ఆరాత్రి నేరం వొప్పుకోమ్మని నన్ను కొట్టారు కదా! బాబూ! మళ్ళీ న్యాయమంటారు. ప్రభుత్వమంటారు, దేవుడంటారు. అబలల్ని రక్షిస్తాడంటారు. దేవుణ్ణి యెన్నిసార్లు పిలిచానో దెబ్బలుతింటూ! ఎందరెందర్నో కాపాడాడుకదా! ఎందరో పాపాత్ముల్ని రక్షించినవాడు నన్ను రక్షించలేదేం? ఇంక దేవుడిమాటవిని పాపం చెయ్యకండా నేనెందుకు వుండాలో పోనీ, నేమన్నానే తప్పుచేస్తే దేవుడికి కోపంరావచ్చు. ఏం చేశానని నాకన్ని కష్టాలు? నామానం కాపాడుకున్నందుకే కదా, నాకన్ని తిప్పలు? అక్కణ్ణించి తప్పించుకో వొచ్చుననే ఆశకూడా వుంది. నాకు లోకంమీద, మనుషులమీద, నామీదా అసహ్యం పుట్టింది. మాట్టాడకండా పడివున్న నన్ను తన ఇష్టమొచ్చినట్లు చేసిపోయినాడు. వెళ్ళేప్పుడు అతని చెయ్యి పట్టుకుని నన్ను మరి తప్పకండా వొదులుతావుకదఅన్నాను. తల వూగించి పోయాడు. ఇంక నాసిగ్గునేం చెప్పను? అతని తరువాత యింకోడు. ఎందరో! అట్టానే బిగుసుకుని పడివున్నాను. నేనుకదలకపోతే 'ఏం మాట్లాడవేం, కదలవేం' అని ఎక్కడెక్కడో గుద్దారు. ఆరాత్రితో నా కున్న అభిమానమూ ధర్మబుద్ధీ, లోకంలో విశ్వాసమూ, పోయినాయి. లోకమంతా డబ్బు, డబ్బుకోసమేవుంది. ఎట్లానూ మా

A. Leela Nageswari



బోటివాళ్ళం శీలాన్ని కాపాడుకోలేము. ఎట్లానూ పోతున్న శీలాన్ని, దాచుకోవాలని చూసి యీ బాధలెందుకు, వచ్చేడబ్బుని వదులుకోడ మెందుకు? తెలివితక్కువ. ఎంత మోసంచేస్తే అంత సుఖపడతామని రూఢిచేసుకున్నాను. మీకేం అదృష్టవంతులు. డబ్బడిగిన మాత్రాన చీదరించు కుంటారు. మర్నాడు నా తండ్రికి కబురంపించి నన్ను వప్పగించారు. ఆనాటినించి నన్ను వెంకయ్య వుంచుకున్నాడు. నగలిచ్చాడు, బట్టలిచ్చాడు, తాగించాడు, కడుపునిండా బువ్వపెట్టాడు. అమ్మ దెబ్బలనించి తప్పించాడు. ఇంకో మొగాణ్ణి నావేపు కన్నెత్తకండా చేశాడు. ఆయన బతికివున్నన్నాళ్ళూ. నామొగుడునాకోసంవస్తే అతని నోరుమూసి మళ్ళీ రంగం పంపాడు——ఆయన చచ్చాడు. తరవాత యేం చెయ్యను? నేను రెండురూపాయలు తీసుకొస్తేనేగాని యిల్లు గడవదు. గొప్పబతుక్కి అలవాటు పడ్డాము, వెంకయ్యధర్మాన. సొమ్ము తీసుకొస్తేనేగాని అమ్మ వూరుకోదు. తిరగబడ్డానా మళ్ళీ దేశాలపాలు; అక్కడా మొగాళ్ళు ఇంతే! ఎక్కడాతప్పదు నా జీవితానికి! ఈ అందమే నాకు శత్రువు. ఈబతుకుతప్ప నాకు శరణ్యంలేదు.ఇప్పటికీ డబ్బు అడగడం ఎంతో కష్టంగా వుంటుది. కాని ఏం చెయ్యను? మీరు చెప్పండి.

కథా నిలయం
శ్రీకాకుళం